సాక్షి చిత్తూరు

సోమవారం । 27 । నవంబర్ । 2023



ఆత్మీయ స్వాగతం

జిల్లాకు విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా ప్రజాప్రతినిధులు అధికారులు, ఘన స్వాగతం పలికారు.

- 8లో



ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్‌కు స్పందన

జిల్లావ్యాప్తంగా నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలకు స్పందన లభించింది. విద్యార్థులు ఈ పరీక్షల్లో భారీగా పాల్గొన్నారు.

- 8లో



ఉత్కంఠగా కబడ్డీ పోటీలు

గత మూడు రోజులుగా నిర్వహించిన అండర్–17 బాలుర, బాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి.

- 8లో

అపూర్వ స్వాగతం

సాక్షి తిరుపతి/ రేణిగుంట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం రాత్రి తిరుమల పర్యటన నిమిత్తం జిల్లాకు విచ్చేశారు. ప్రధానికి రేణిగుంట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో ముందుగా సాయంత్రం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ముఖ్యమంత్రికి మంత్రులు.. ప్రజాప్రతినిధులు.. అధికారులు సాదర ఆహ్వానం పలికారు. సీఎం వెంట విమానంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వచ్చారు. ప్రధానమంత్రి తిరుమలకు బయలుదేరిన తర్వాత ముఖ్యమంత్రి విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, వరప్రసాద్‌రావు, వెంకటేగౌడ, ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణచక్రవర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ, ఎస్పీలు పరమేశ్వర్‌రెడ్డి, అన్బురాజన్, తిరుపతి మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ హరిత, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆర్‌డీఓలు రవిశంకర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, చంద్రముని తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన కోసం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు సాదర ఆహ్వానం అందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మెమెంటో అందిస్తున్న సీఎం వైఎస్ జగన్, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ప్రధాని

తిరుమల: రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం రాత్రి తిరుమల చేరుకున్నారు. శ్రీరచనా అతిథిగృహం వద్ద ఈఓ ధర్మారెడ్డి, రచనా టెలివిజన్ డైరెక్టర్ తుమ్మల రచనా స్వాగతం పలికారు. సోమవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు.



ప్రధానికి స్వాగతం పలుకుతున్న మంత్రులు, ఎంపీలు



ముఖ్యమంత్రితో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు





ప్రధానితో కరచాలనం చేస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

న్యూస్‌రీల్

రాజ్యాంగ పితామహుడు అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ముందుచూపుతో మనకు రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ పితామహుడిగా చరిత్రలో నిలిచిపోయారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక ప్రసిద్ధ సామాజిక సంస్కర్త అని, రాజకీయవేత్త, న్యాయవాదిగానే కాకుండా, రాజ్యాంగ పితామహుడిగా పిలుస్తారని తెలిపారు. అనంతరం మండలంలోని కొత్తూరు, గోవిందనగర్ గ్రామాల్లో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేస్తున్న సీసీరోడ్ల పనులను ఆయన పరిశీలించారు. అలాగే పట్టణంలోని దుర్గామాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి



జడ్జికి స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తమ్ముళ్లకు థామస్‌తో తలనొప్పి

వెదురుకుప్పం(కార్వేటినగరం) : గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ థామస్ వ్యవహార శైలి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తలనొప్పిగా మారింది. ఇటీవల వరుస విభేదాలు బయటపడుతుండగా, ఆదివారం వెదురుకుప్పంలో మరోమారు టీడీపీ గ్రూపు రాజకీయాలు భగ్గుమన్నాయి. మాంబేడు గ్రామంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జ్ థామస్ ఆ పార్టీ కేడర్‌కు సమాచారం ఇవ్వకుండా హాజరయ్యారు. అలాగే పచ్చికాపల్లం పంచాయతీ ఎర్రగుంట గ్రామంలో ఓ యువకుడు మృతి చెందిన విషయం తెలిసి థామస్, టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ మబ్బు దేవనారాయణరెడ్డితో పాటు కొంతమంది టీడీపీ శ్రేణులతో మాత్రమే వెళ్లి నివాళులు అర్పించారు. అయితే స్థానికంగా ఉన్న బూత్‌కమిటీ కన్వీనర్లకు గానీ, పంచాయతీలో నాయకులకు, గ్రామంలో ఉన్న టీడీపీ నాయకులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా హాజరు కావడంపై సొంత పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆ పార్టీ నాయకులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.

ఐకమత్యంతో ఉండాలి



మాట్లాడుతున్న అన్నా రామచంద్రయ్య

చిత్తూరు రూరల్: యాదవులు ఐక్యమత్యంతో ఉండి..అన్ని రంగాల్లో రాణించాలని జాతీయ మహాసభ ఉపాధ్యక్షుడు అన్నా రామచంద్రయ్య అన్నారు. ఆదివారం చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేట కల్యాణ మండపంలో అఖిల భారత యాదవ మహాసభ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా ఎదగాలన్నారు. రాజకీయ రంగంలో కూడా ముందడుగు వేయాలని, రాజ్యాధికారమే లక్ష్యంగా వచ్చే ఎన్నికల్లో శంఖారావం పూరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవానందం యాదవ్, నవీన్‌యాదవ్, అశోక్ నంద యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



భక్తులతో నిండిపోయిన క్యూలైన్లు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకోవడానికి సమయం 6 గంటలు పడుతోంది. అరుణాచలం, శబరిమల వెళ్లే భక్తులు స్వామివారి దర్శనార్థం భారీగా తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు దినం కావడం, తమిళనాడులోని అరుణాచలంలో గిరిబలం(కొండ ప్రదక్షిణ)కు వెళ్లే భక్తులు, అలాగే కార్తీక మాసంలో మండల దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప భక్తులు, సామాన్య భక్తులు స్వామివారి దర్శనార్థం తరలిరావడంతో రూ.150, రూ.100 క్యూలైన్లు అన్నీ భక్తులతో నిండిపోయి ఆరుబయట వరకు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుని భక్తులకు దర్శనం కల్పించారు. దివ్యాంగులు, వృద్ధులు, చంటి పిల్లల తల్లిదండ్రులు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. అరుణాచలం, అయ్యప్ప భక్తులు బస్సుల్లో తరలిరావడంతో పార్కింగ్ స్థలంలో బస్సులు నిండిపోయిన రహదారిలో పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఓటు హక్కు విలువైనది

చిత్తూరు కలెక్టరేట్ : ఓటు హక్కు విలువైనదని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అన్నారు. ఓటు హక్కు నమోదు ప్రక్రియలో భాగంగా ఆదివారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆయన సతీమణి వరలక్ష్మికి బీఎల్ఓ ఓటు నమోదు ఫారం–6ను అందజేశారు. నగరంలోని 50వ పోలింగ్ స్టేషన్‌లో వారికి ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తును నమోదు చేసి రశీదును అందించారు. జేసీ మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న వారంతా బాధ్యతగా ఓటు వేయాలని, మెరుగైన సమాజం నిర్మాణానికి ఓటే ఆయుధం అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చిన్నయ్య, బీఎల్ఓ పాల్గొన్నారు.

దివ్యతేజం





కార్తీక పౌర్ణమి.. కృత్తికా నక్షత్రం సందర్భంగా జిల్లాలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దేదీప్యమానంగా కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి, అమ్మవార్లను సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యంగా తిరుమల శ్రీవారి ఆలయంలో విశేషంగా దీపోత్సవం నిర్వహించారు. తిరుపతి కపిలతీర్థంలోని శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో మహిళలు దివ్యదీపారాధన చేపట్టారు. - తిరుపతి కల్చరల్, తిరుమల

కార్తీక శోభ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో, అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు కుటుంబ సభ్యులు, అధికారులు, ప్రధాన ఆలయంలో ఆలయ అర్చక వేదపండితులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వారు వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. అలాగే దీపాలను ఊరేగింపుగా స్వామివారి అనుబంధ ఆలయమైన మణికంఠేశ్వర స్వామి ఆలయంలో శివలింగం రూపంలో దీపాలను, జ్వాల తోరణాలను శాస్త్రోక్తంగా పూజలు చేసి వెలిగించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను జ్వాలా తోరణం కింద ఉంచి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. రాత్రి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.



జ్వాలా తోరణం కింద శివపార్వతుల ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ, అధికారులు



ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న చైర్మన్, ఈఓ



జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న ఆలయ అధికారులు

పసి బిడ్డకు చక్కని వైద్యం

రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో అన్ని సదుపాయాలను కల్పిస్తోంది. శిశు సంరక్షణ పేరిట ఆధునిక సేవలను అందుబాటులోకి తెచ్చింది. దీంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డులో సిబ్బంది చిరునవ్వులతో చికిత్స అందిస్తున్నారు. పుట్టే బిడ్డ నుంచి 15 ఏళ్ల పిల్లల వరకు నాణ్యమైన వైద్యం అందించి ప్రాణం పోస్తున్నారు. ఈ సేవలకు ముస్కాన్ కమిటీ అవార్డును ప్రకటించి ప్రోత్సహించింది.

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువులకు నాణ్యమైన వైద్యం
- పురుడు నుంచి 15 ఏళ్ల చిన్నారుల వరకు ఇబ్బంది లేకుండా వైద్యసేవలు
- చిన్నపిల్లల వార్డులో అందుతున్న సేవలకు గానూ ముస్కాన్ అవార్డు
- భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందిస్తామంటున్న ఆస్పత్రి వైద్యసిబ్బంది



ఎస్‌ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న చిన్నారులు

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతి భవనంలో చిన్నారులకు ఎక్కడా లేనివిధంగా నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లల విభాగంలో ఓపీడీతో పాటు రెండు వార్డులు ఉండగా, నూతన భవనంలో చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా మరో రెండువార్డులు సైతం ఉన్నాయి. ఇక్కడ మొత్తం 60 బెడ్లు ఉండగా, నవజాత శిశువులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ఎస్ఎన్‌సీయూ(స్పెషల్ న్యూ బార్న్ కేర్ యూనిట్) 24 గంటలు పనిచేస్తోంది. దీంతో పాటు ఐసీయూ సేవలు కూడా అందుబాటులో ఉండగా, ఈ పరిధిలో నలుగురు వైద్యులు, 12 మంది పీజీ డాక్టర్లు ఉండగా, 25 మంది సిబ్బంది పని చేస్తున్నారు. బిడ్డ ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు, తక్కువ బరువుతో పుట్టడం, నెల తక్కువగా జన్మించడం, న్యూమోనియా, గుండె సంబంధిత సమస్యలు, మెదడు వాపు, బ్లడ్ ఇన్‌ఫెక్షన్, జలుబు తీవ్ర జ్వరం వంటి కేసులే ఈ ఆస్పత్రికి ఎక్కువగా వస్తుంటాయి. ప్రతి నెలా ఇన్‌పేషెంట్ 300 నుంచి 500 వరకు ఉండగా, అవుట్ పేషెంట్ల సంఖ్య 2,750 దాటుతోంది. వీరికి తక్షణ సేవలు అందించేందుకు ప్రభుత్వం కావలసిన పరికరాలను అందిస్తోంది.

ముస్కాన్ అవార్డు ఇలా..

ఐదు నెలల క్రితం వైద్య ఆరోగ్యశాఖలోని నాణ్యతా ప్రమాణ విభాగ అధికారులు ఆస్పత్రిని ముస్కాన్ కమిటీ సభ్యులు సందర్శించారు. చిన్న పిల్లల విభాగంలోని ఓపీడీ, ఎస్ఎన్‌సీయూ, ఐపీయూ, వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యుల పనితీరు, పారిశుద్ధ్యం, పిల్లలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ముఖ్యంగా వైద్యంలో నాణ్యతా ప్రమాణాలపై లోతుగా విచారించారు. రికార్డులు, మాత్రలు, మందుల సరఫరాపై అధ్యయనం పూర్తి చేసిన కేంద్రం బృందం ఆస్పత్రిలో చిన్నారులకు అందుతున్న వైద్యసేవల అమలుతీరును ప్రభుత్వం ముందు పెట్టింది. ఈమేరకు ఆస్పత్రికి గుర్తింపు లభించడంతో పాటు రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. 2 రోజుల క్రితం ముస్కాన్ పేరిట అవార్డును కమిషనర్ కార్యాలయానికి పంపింది. ఈ గుర్తింపు ద్వారా ఆస్పత్రికి మరిన్ని మంచి రోజులు రావచ్చని అధికారులు భావిస్తున్నారు.

సదుపాయాలు ఇలా..

- పుట్టే బిడ్డ నుంచి 15 ఏళ్ల వరకు చిన్న పిల్లల విభాగంలో కార్పొరేట్‌కు ధీటుగా అత్యాధునిక పరికాలతో వైద్యం అందిస్తున్నారు.
- ఎస్ఎన్‌సీయూలో ఇంక్యుబేటర్, వార్మర్స్, ఫొటోథెరపీ, సెంట్రల్ ఆక్సిజన్ సరఫరా, సీఫాప్, వెంటిలేటర్‌లు ఉన్నాయి.
- ఐసీయూలో కూడా వెంటిలేటర్లు, 24 గంటలు మానిటరింగ్, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సదుపాయాలతో నిరంతరం పిల్లలకు చికిత్స అందిస్తున్నారు.

సమష్టి కృషితోనే సాధ్యం..

అందరూ సమష్టిగా కృషి చేస్తే చిన్న పిల్లల విభాగానికి ముస్కాన్ అవార్డు లభించింది. ఈ విభాగానికి మాత్రమే కాదు ఆస్పత్రికే మంచి పేరు రావాలి. అందుకు మనమంతా మంచి సేవలు అందించాలి. నిర్లక్ష్యం ఉండకూడదు. అత్యవసర సేవల విషయంలో తక్షణం స్పందించండి. రాష్ట్రప్రభుత్వం మాతాశిశు మరణాల కట్టడికి చర్యలు తీసుకుంటోంది. శిశు మరణాలు జరగకుండా చూడాలి. చిన్న పిల్లల విభాగంలో సేవలు మరింత వృద్ధి అయ్యేలా చూస్తాం.

– రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్, చిత్తూరు



నేడు కలెక్టరేట్‌లో స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 27న అంటే సోమవారం అనివార్య కారణాలతో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. వ్యయప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రానికి రావద్దని ఆయన సూచించారు.

బోయకొండకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లి: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మ అమ్మవారి దీవెనల కోసం భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో బోయకొండ ఎటు చూసినా జనసంద్రంగా కనిపించింది. ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం విచ్చేయడంతో ఆదివారం నాడు ఒకరోజే సుమారు 15 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ఎన్‌సీసీతో ఉత్తమ జీవన విధానం



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌సీసీ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌సీసీతో ఉత్తమ జీవన విధానం లభిస్తుందని 35(ఏ) బీఎన్ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అజయ్‌బస్‌నెట్ అన్నారు. ఆదివారం నగరంలోని కొత్తబస్టాండ్ వద్ద ఉన్న అమరజవానుల స్మారకస్థూపం వద్ద ఎన్‌సీసీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. యుద్ధంలో వీరమరణం పొందిన అమర జవానులకు నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన జవానులను ఎన్నటికీ మరువలేమన్నారు. విద్యార్థులు ఎన్‌సీసీ శిక్షణతో చక్కని జీవనం కొనసాగించవచ్చన్నారు. అనంతరం పలువురు ఎన్‌సీసీ కేడెట్‌లు రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో పీవీకేఎన్ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి, ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రసాద్‌రెడ్డి, ఎన్‌సీసీ కేడెట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి దీపోత్సవం

నాగలాపురం: మండలంలో సురుటుపల్లెలోని శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు స్వామి అమ్మవార్లకు పంచామృత మహాభిషేకం, 11 గంటలకు వాల్మీకి స్వామికి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం 5 గంటలకు భక్తులు శివలింగం, నందీశ్వర స్వామికి దీపాలు వెలిగించడంతో సరికొత్తశోభ సంతరించుకుంది. స్వామి అమ్మవార్లు వృషభ వాహనంపై ఆలయ ప్రాకారంలో విహరించారు. రాజగోపురం ముందు అర్చకులు జ్వాలాతోరణం వెలిగించారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి పాల్గొన్నారు.



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి





సీఎం జగన్‌కు శాలువా కప్పుతున్న మంత్రి నారాయణస్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

ఆత్మీయ స్వాగతం.. వీడ్కోలు

తిరుమల పర్యటనకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సాదర ఆహ్వానం పలికేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం విజయవాడకు బయలుదేరిన ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు ఇచ్చారు.

- రేణిగుంట



సీఎంకు నమస్కరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి



సీఎం జగన్‌తో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప



సీఎం జగన్‌తో ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి



సీఎం జగన్‌తో పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

సమ్మేటివ్-1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 27 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు పరీక్షల నిర్వహణ
- డిసెంబర్ 9న పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం
- డీఈఓ విజయేంద్రరావు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సమ్మేటివ్-1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబర్ 8వ తేదీ వరకు నిర్దేశించిన షెడ్యూల్ మేరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓలు పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

గంట ముందు ప్రశ్నపత్రాలు తీసుకెళ్లండి..

ప్రశ్నాపత్రాలను ఏ రోజుకు ఆ రోజు పరీక్ష ప్రారంభమయ్యే గంట ముందు ఎంఈఓ కార్యాలయాల నుంచి ప్రశ్నపత్రాలను తీసుకెళ్లాలని డీఈఓ విజయేంద్రరావు సూచించారు. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. సీబీఎస్‌ఈ పాఠశాలల్లో ఎనిమిదో తరగతికి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, తొమ్మిదవ తరగతికి మధ్యాహ్నం 1.30 గంట నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలను జరపాలన్నారు. పరీక్షలు పూర్తైన వెంటనే ఉపాధ్యాయులు వారి సబ్జెక్టుల్లో కీ స్వయంగా తయారు చేసుకుని జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాలని సూచించారు. విద్యార్థులు పొందిన మార్కులను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోపు స్టూడెంట్ ఇన్ఫో సైట్‌లో నమోదు చేయాలని తెలిపారు. అలాగే జవాబు పత్రాలను తనిఖీ నిమిత్తం భద్రపరచాలన్నారు. డిసెంబర్ 9వ తేదీన ప్రతి పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను అందజేయాలని డీఈఓ ఆదేశించారు.

సత్యసాయి యూనివర్సిటీ టాపర్‌గా భార్గవ్‌రెడ్డి



రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న భార్గవ్‌రెడ్డి

పూతలపట్టు: మండలం ముత్తిరేవుల గ్రామానికి చెందిన సుభాష్‌రెడ్డి కుమారుడు భార్గవ్‌రెడ్డి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుని ప్రశంసలు అందుకుంటున్నాడు. భార్గవ్‌రెడ్డి శ్రీసత్యసాయి జిల్లాలోని శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాడు. ఈ నెల 22వ తేదీన శ్రీ సత్యసాయి ఆడిటోరియంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా అతను గోల్డ్‌మెడల్ అందుకున్నాడు. ఈ సందర్భంగా భార్గవ్‌రెడ్డిని యూనివర్సిటీ అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

పంటలపై ఏనుగుల దాడి



ధ్వంసమైన కొబ్బరి చెట్లు

పాకాల: మండలంలోని దామల చెరువుకు ఆనుకుని ఉన్న యల్లంపల్లె సమీపంలోని పంటలపై ఏనుగులు దాడి చేసి నష్టం కలిగించిన సంఘటన ఆదివారం వేకువ జామున చోటు చేసుకుంది. వివరాలు.. తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో మామిడి తోటల్లో ఏనుగుల సంచరించాయి. రామ్మూర్తిరెడ్డికి చెందిన మూడేళ్ల కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. సుమారు 60 నుంచి 70 చెట్ల వరకు ఏనుగులు నాశనం చేశాయని బాధిత రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. అటవీ అధికారులు పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరాడు.

పకడ్బందీగా ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్



మోడల్ ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని పలు మండలాల్లో ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరోత్తమరెడ్డి మాట్లాడుతూ 2015వ సంవత్సరం నుంచి ఏటా నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ మోడల్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పరీక్షకు 3 వేల మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఈ పరీక్షను ఎంఈఓ-2 మోహన్, అసోసియేషన్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పుష్పలత, ఇతర టీచర్లు పర్యవేక్షించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సైదాపురం : మండలకేంద్రంలోని ఆస్పత్రి సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.3,520 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చల్లా వాసు తెలిపారు.

నేడు, రేపు అంతర్జాతీయ బృందం పర్యటన

- జిల్లాలోని గుడుపల్లి, రామకుప్పం, బంగారుపాళ్యం, పెనుమూరు మండలాల్లో పర్యటన
- కలెక్టర్ షణ్మోహన్



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 27, 28 తేదీల్లో అంతర్జాతీయ బృందం పర్యటించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో సేంద్రియ సాగు పరిశీలనకు అంతర్జాతీయ బృంద సభ్యులు జిల్లాకు విచ్చేస్తున్నారని చెప్పారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా, సమర్థవంతంగా ప్రకృతి సూత్రాలకు అనుగుణంగా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలిస్తారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సీజీఐఏఆర్ (అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంప్రదింపుల సమూహం) బృంద సభ్యులు పర్యటిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో రైతు సాధికార సంస్థ ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం(ఏపీసీఎన్‌ఎఫ్) ప్రాజెక్టు పేరుతో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఆ కార్యక్రమాలు ప్రపంచ బృంద సభ్యులను ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు లావోస్ పీడీఆర్, భారత్, కెన్యా, జింబాబ్వే, సెనెగల్, బుర్కినా, ఫావో, ట్యూనీషియా, పెరూ మొత్తం 8 దేశాలకు చెందిన 60 మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు అర్థం చేసుకునేందుకు విచ్చేస్తున్నారని తెలిపారు.

రెండు బృందాలుగా పర్యటనలు..


జిల్లాకు విచ్చేస్తున్న అంతర్జాతీయ బృంద సభ్యులు రెండు బృందాలుగా విడిపోయి పర్యటిస్తారని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. రోజుకు నాలుగు గ్రామాలను సందర్శిస్తారని, అందులో ఈ నెల 26న ఒక బృందం కుప్పం పరిధిలోని గుడుపల్లి మండలం గోకర్లపల్లి, సిగలపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పర్యటిస్తుందన్నారు. ఆయా గ్రామాల్లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి, అనంతరం మహిళా సంఘాలతో, రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారని తెలిపారు. రెండవ బృందం అదే రోజు బంగారుపాళ్యం మండలంలోని కల్లూరిపల్లిలో పర్యటిస్తుందన్నారు. ఈనెల 28న ఒక బృందం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రామకుప్పం మండలంలోని అంకిరెడ్డిపల్లిలో పర్యటించి విత్తనగుళికలు తయారు చేసే విధానం, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. మరో బృందం పెనుమూరు మండలంలోని చారవగానిపల్లి గ్రామంలో పర్యటిస్తుందని, వీరి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



నుజ్జునుజ్జయిన కారు ముందుభాగం





మృతి చెందిన మునెమ్మ, తీవ్రంగా గాయపడిన వెంకటేశు

పలమనేరు: మండలంలోని బురిశెట్టిపల్లి వద్ద ఆదివారం బైక్‌ను ఓ కారు ఢీకొనడంతో మహిళ మృతి చెందగా, బైక్ నడుపుతున్న వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. బైరెడ్డిపల్లి మండలం మిట్టకురప్పల్లికి చెందిన మునెమ్మ(50), ఆమె కుమారుడు వెంకటేశు(26) పలమనేరు వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ములకలచెరువుకు వెళ్తున్న కారు బురిశెట్టిపల్లి వద్ద వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ వెనుక వైపున కూర్చున్న తల్లి మునెమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు వెంకటేశ్‌కు రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 వాహనంలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పలమనేరు ఎస్‌ఐ సహదేవి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

దొరవారిసత్రం : మండలంలోని వేణుంబాకం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున జరిగిన ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సూళ్లూరుపేట వైపు నడిచి వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధశతాబ్దపు స్నేహాన్ని గుర్తు చేసుకుని..



51 సంవత్సరాల తరువాత కలుసుకున్న పీవీకేఎన్ పూర్వ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1969–1972 మధ్య బీజెడ్‌సీ చదివిన పూర్వ విద్యార్థులు 51 ఏళ్ల తరువాత ఆదివారం స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో కలుసుకున్నారు. ఇన్నేళ్ల తరువాత కలిసిన వారు నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు, కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జీవనజ్యోతి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిని వివరించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సలహాదారులు డా.దయానందరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్ మాట్లాడుతూ దేశ విద్యావ్యవస్థకే వన్నె తెచ్చే స్థాయికి కళాశాల అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిట్టిబాబు, ప్రకాష్, గురుస్వామినాయుడు, అధ్యాపకులు గోపినాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

- బాలికల విభాగంలో విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు, బాలుర విభాగంలో విజయనగరం జట్టు
- అండర్-17 కబడ్డీ విజేతలకు ట్రోఫీలు అందజేత



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో బాలికల విభాగంలో విజేతగా నిలిచిన చిత్తూరు జిల్లా జట్టు

చౌడేపల్లి: అండర్-17 అంతర్‌జిల్లాల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల విజేతలుగా బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు, బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్టు సొంతం చేసుకున్నాయని కబడ్డీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు టి. రామచంద్ర, క్రీడల అబ్జర్వర్ రామ్‌బాబు ఆదివారం తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లె ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో మూడురోజులపాటు ఈ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు వివిధ దశల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఫైనల్స్‌లో బాలురు విజయనగరం-కృష్ణ జట్లు తలపడగా 36–24 పాయింట్లతో విజయనగరం విజయం సాధించింది. అలాగే బాలికల విభాగంలో శ్రీకాకుళం -చిత్తూరు జట్లు పోటీపడగా అందులో 44-68 పాయింట్లతో చిత్తూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. టోర్నీ రన్నర్స్‌గా బాలుర విభాగంలో కృష్ణ జిల్లా జట్టు, 3వ స్థానంలో చిత్తూరు, 4వ స్థానంలో శ్రీకాకుళం జిల్లాజట్లు నిలిచాయి. బాలికల విభాగంలో రన్నర్స్‌గా శ్రీకాకుళం జిల్లా జట్టు, మూడవస్థానంలో ప్రకాశం జిల్లా జట్టు, నాలుగో స్థానంలో కర్నూలు జిల్లా జట్టు నిలిచాయి. విజేతలకు ప్రజాప్రతినిధులు చాంపియన్ కప్‌లతో పాటు మెమెంటోలు, షీల్డులు అందజేశారు. బాలికల విభాగంలో విజేతగా నిలిచిన చిత్తూరు జిల్లా జట్టుకు జెడ్పీటీసీ దామోదరరాజు రూ.10 వేలు, బాలుర జట్టుకు రూ.5వేలు ఆర్థిక ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. కబడ్డీ మాజీ ప్లేయర్ భ్రమరాంబ బాలికల విన్నర్స్ జట్టుకు రూ.5116, రన్నర్స్ జట్టుకు రూ.3116 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ యూత్ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, సర్పంచ్ వరుణ్‌భరత్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్, మల్‌రెడ్డి, సీఐ కృష్ణారెడ్డి, తహసీల్దార్ మాధవరాజు, ఎస్‌ఐ రవికుమార్, హెచ్‌ఎం నాగరాజా రెడ్డి, బసవరాజు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో బాలుర విభాగంలో విన్నర్‌గా నిలిచిన విజయనగరం జిల్లాజట్టు



బాలుర విభాగంలో రన్నర్‌గా నిలిచిన కృష్ణా జిల్లా జట్టు



బాలికల విభాగంలో రన్నర్స్‌గా నిలిచిన శ్రీకాకుళం జట్టు